# స్వార్థమెరుగని త్యాగం

శ్రీ సి. సి. పున్నయ్య

---

అప్పటి వరకు ఆడుతూ పాడుతూ అల్లారుముద్దుగానున్న రాకుమారుడు ఆకస్మికంగా స్పృహ తప్పిపోవడం రాజుకే కాదు యావత్ప్రజానీకానికి కలవరపాటుకు కారణమయింది. కారణమేమయి యుంటుందా అని రాజు, రాణి, మంత్రులు, సామంతులు ఆదుర్దాపడసాగారు. వైద్యులు పరిశీలించి రాజకుమారుని కేర్పడిన ప్రమాదకర పరిస్థితికి కారణం తెలియక తబ్బిబ్బగుచున్నారు. దైవజ్ఞులు, రాజపురోహితులు కలతబారిన హృదయాలతో అదేదో తప్పక భగవన్మాయయని తేల్చి చెప్పారు. రాజు, రాణి వేయిదేవుళ్లకు మొక్కసాగారు. తాము చేసిన అపరాధములను క్షమించి తమ కుమారుని రక్షించమని పదే పదే ప్రార్థనలు సలిపారు. కాని రాజకుమారుని పరిస్థితిలో మార్పు రాలేదు. క్షణక్షణానికి నీరసచ్ఛాయలు స్ఫుటంగా గోచరించసాగినవి. రాజకుమారుని ప్రక్కన ఒక పన్నెండేండ్ల బాలుడు మోకాళ్లపై నిలుచుండి అర్ధనిమీలిత నేత్రాలతో ధ్యానసముద్రంలో నున్నాడు. బహుశ రాజకుమారుని రక్షించమని భగవంతుని ప్రార్థిస్తుండాలి!

వయోవృద్ధుడు - అంధుడు, చిన్న పూరి గుడిశలో తన కుమారునితో తలదాచుకుంటున్నాడు. తన్మయత్వంతో భగవన్నామ సంకీర్తనం చేస్తూ ఆ పట్టణ వీధుల్లో కుమారుని వెంటబెట్టుకొని తిరిగేవాడు. అతని గాన మాధుర్యానికి మానవులే కాదు, దేవతలు సయితం, తన్మయులయ్యేవారు. అతడు భగవంతుని తప్ప యితరులను కీర్తించడు; యితరులు పాడమంటే పాడడు. డబ్బు సంపాదించి నిల్వ చేయాలనే ఆశలేదు. అతని గానము భగవంతునుద్దేశించి - భగవంతుని గురించి - భగవంతుని కొరకు. మానవులకని యుద్దేశించిందికాదు. తాను పాడుతూ తిరుగుతుండే నగర వీధుల్లో ప్రజలు తండోపతండాలుగా గుమిగూడేవారు. కాని అతని గానామృతము బయటివారి ఆదుపాజ్ఞలకు లొంగేదికాదు. ఒకరు పాడమంటే పాడడు, పాడుతుంటే యితరులాపమంటే ఆపడు. ఆలయంలో భగవత్సాన్నిధ్యంలో అమృత గానాన్ని వర్షిస్తుంటే అతనితోబాటు గుమికూడినవారు సయితం బాహ్య ప్రపంచాన్ని పూర్తిగా మరచిపోయేవారు. అబ్బ, కొడుకులకు కూటికి గుడ్డకు కరువు లేకుండా జరిగిపోతున్నది.

ఒక రోజున ఆ వృద్ధుడు నుక్కి మంచంలో పండుకొని యున్నాడు. కొడుకు పరుగెత్తుకొని వెళ్లి "నాన్నా! మనం యిలా శాశ్వతంగా బిచ్చగాళ్లంగా నుండాల్సిందేనా" అడిగాడు ఏదో ఆవేదనతో.

"ఏం నాయనా! మనకేం కొరత యిప్పుడు? భగవంతుడు మనకు కూటికి, గుడ్డకు కొరతలేకుండా పోషిస్తూనే యున్నాడు కదా! రక్తిని, ముక్తిని ప్రసాదించే భగవన్నామ సంకీర్తనతో ఆనందంగా జీవయాత్ర సాగిస్తున్నాము. మనకింతకంటె తృప్తికరమైనది ఏమి కావాలి? మన జీవితావసరాలకు మించిన ఆర్జన మానవునకప్పుడు వాంఛనీయం కాదు; మానవుని మితిమీరిన డబ్బు, డబ్బుమీది కాంక్ష లెక్కలేనన్ని తప్పుడు మార్గాలలో నీతినియమాలను తప్పి నడిపిస్తుంది. అట్టి జీవితము నేనా మనం భగవత్ప్రింతను, పరమార్థమును వీడి అపేక్షించవలసినది?"

"చాల బాగుందిలే నాన్నా! నీవు చెప్పడం! - రాజాస్థానానికి వెళ్లి అనేకమంది గాయకులు, వేలు వందలు ఆర్జించుకొని సుఖంగా జీవయాత్ర సాగిస్తుంటే మనమిలాగే బజారు, బజారు తిరుగుతూ బిచ్చమెత్తుకుంటున్నాము" అన్నాడు నిష్ఠూరంగా.

"బాబూ! యిప్పుడు నీవు అనిన మాటలు మరొకసారి పలుకవాక - జాగ్రత్త! భగవన్నామ

సంకీర్తనకని యుద్దేశించిన నా గానమును వెలకాదు కదా - లక్షలిచ్చినా రాజులైనాసరే, రారాజులైనాసరే వారి ఆజ్ఞల ననుసరించి, వారి ఆనందానికి, నా పొట్టకూటి సంపాదనకు వినియోగించను. అది భగవంతుని సొమ్ము. భగవంతునకే కైంకర్యము కావలసినది. మన మంచి చెడ్డలను ఆ దీనజనబాంధవునికే వదులుదాం" అన్నాడు ఉద్రేకంతో. ఆ యుద్రేకాన్ని చూచి కొడుకు కుక్కిన పేనులాగయిపోయాడు.

ఆ వృద్ధుని గాన మాధుర్యాన్ని గురించి రాణి విని రాజుతో చెప్పింది. మంత్రిని పిలిపించి ఆ యంధగాయకుని గురించి భోగట్టా అడిగాడు.

"ప్రభూ! అతడొక దివ్య పురుషుడు - పరమ భక్తుడు. ధనాపేక్ష లేదు. భగవంతు నుద్దేశించి, భగవత్సాన్నిధ్యములో తప్ప రాజులుకాని, రారాజులుకాని వారి ఎదుట, ఆ స్థానాలలో వారిని కీర్తించడు; పాడడు" అన్నాడు మంత్రి.

"అయితే నీవాతనిని మన ఆస్థానంలోకి పిలుచుకొనిరాలేని అశక్తుడవన్నమాట!"

"లేదు ప్రభూ! - ఎలాగైనా పిలుచుకొని వస్తాను" అని వెళ్ళిపోయాడు.

మంత్రి అమావాశ్య చీకట్లో ఆ యంధగాయకుని యింటికి వెళ్ళి సన్నని దీపపు వెలుతురులో మంచముమీద కూర్చొనియున్న బాలుణ్ణి యివతలికి పిలిచి "బాబూ! యిదుగో యీ మధుర భక్ష్యాలను, ఉడుపులను తీసికో" అని అతనిచేతి కందిచ్చాడు.

"ఇవన్నీ ఏమిటి బాబయ్యా!" అన్నాడు బాలుడు.

"మీ దరిద్రము తొలగిపోయే రోజులు వచ్చాయి. నీవు మీ నాయన రాజాస్థానానికి వచ్చి, మీ నాయన గాన మాధుర్యాన్ని వినిపిస్తే మీరు కోరినంత ధనం. అది మాత్రమే కాదు - ఏది కోరితే అది - నీవు ఎలాగైనా మీ నాయన్ను వెంటబెట్టుకొనివచ్చి పాడించాలి. మీ అదృష్టానికిదియొక మహదావకాశం" అని చెప్పి మెల్లగా వెళ్ళిపోయాడు. తను తండ్రి నెలా ఒప్పించి రాజాస్థానంలో పాడించగలనా అని అనుకొంటూ గుడిశలోకి వెళ్ళాడు.

"ఎవరు బాబూ! గుడిశ వెలుపల మాట్లాడుతున్నట్లున్నది" అన్నాడు తండ్రి.

"ఎవరో ఒక దయార్ద్ర హృదయుడు - మనకని యీ భక్ష్యాలు, ఉడుపులు తెచ్చియిచ్చి వెళ్ళాడు."

"భగవంతుడు దీన జన రక్షకుడు. ఆయన దయాకటాక్షములు అనన్యములు" అంటూ ఉడుపులను చేతులతో తడువుతూ కొడుకుముందు పెట్టిన భక్ష్యాలను చేతితో తీసికొని తినసాగాడు. తండ్రి కొడుకులు తిని చెరొక మంచంమీద ఒత్తిగిల్లారు.

మర్నాడు ఉదయం గాయకుణ్ణి వెంటబెట్టుకొని కొడుకు బయలుదేరాడు. ఎంతో దూరం నడిచారు. గమ్యస్థానమంటూ కానరాని అంధుడు "ఏం బాబూ! మనం చాలదూరం వచ్చినట్లున్నది! - యీ రోజెవరు మనకు కాని డబ్బంటూ యిచ్చినట్లు లేదే!" అన్నాడు.

"లేదు నాన్నా! మనం రామలింగస్వామి ఆలయానికి వెళుతున్నాము. అక్కడ యీ రోజున ఉత్సవ వేడుకలట - అక్కడైనా భగవంతుడు మనకు యీనాడు కడుపునిండే సావకాశం కల్పిస్తాడేమో!"

"తప్పక కల్పిస్తాడు బాబూ! త్వరగా పోదాం పద - ఎండెక్కినట్లున్నది; క్రింద, పైనకూడ కాలుతున్నది" అని బాలుని వెంబడి వడివడిగా నడువసాగాడు.

రాజభవనం ముందుకు రాగానే "దగ్గరకు వచ్చాం నాన్నా! ఆలయ సమీపం యిది" అన్నాడు బాలుడు.

"ధన్యులం" అంటూ కంఠమెత్తి పరమేశ్వరుని కీర్తిస్తూన్న గాన మాధుర్యాన్ని చిందింపజేస్తూ

ముందుకు నడువసాగాడు. రాజభవనం ముఖద్వారం సమీపించి మెట్లెక్కుతూ "ఇవి దేవాలయం మెట్లు లాగలేవే" అన్నాడు.

"దేవాలయమే నాన్నా! యింకా పది అడుగులు ముందుకు నడిస్తే గర్భగుడి" అంటూ చెయ్యి పట్టుకొని ముందుకు తీసికొని వెళ్ళాడు.

రాజు దర్బారులో ఆసీనుడైయున్నాడు. చీమ చిటుక్కుమన్నా వినపడేటంతటి నిశ్శబ్ద వాతావరణంలో అంధగాయకుని సింహాసనాని కెదురుగానున్న ఉన్నతాసనంమీద కూర్చొన బెట్టాడు.

"బాబూ! యిదిచూడ దేవాలయంగా తోచడం లేదు - రాజభవనంలాగున్నది - చలవరాళ్ల నేల, గుమగుమలాడే సుగంధవాసనలు - సరే యీ ఆలయంలో ఎక్కడా ఏ శబ్దము వినిపించడంలేదుమరి-మనంతప్ప మరవ్వరూ లేరా ఏమిటి!"

"కొన్ని వేలమంది నీచుట్టూ యున్నారు. నీ భగవన్నామ సంకీర్తనం వినాలని నిశ్శబ్దంగా చలనరహితులుగా నున్నారు."

"అలాగా!" అని భక్తి పారవశ్యంతో భగవంతుని భజిస్తూ అమోఘంగా గాన సుధను వర్షించాడు. రాజు ఆనందానికి పట్టపగ్గాలు లేకపోయినవి. రాజు, రాణి "భేష్! భేష్!" అని ఎలుగెత్తి తన్మయత్వంతో అన్నారు. దర్బారులోని మంత్రులు, సామంతులు కరతాళ ధ్వనులు, హర్షధ్వానాలు చేశారు.

మరుక్షణంలోనే అనరళమైన గానవాహిని ఆగిపోయింది.

"బాబూ! యిది దేవాలయం కానట్లున్నది - నిజంచెప్పు - మన మెక్కడున్నామిప్పుడు" అని గద్దించి అడుగుతూ తాను కూర్చున్న ఆసనము దిగాడు.

కొడుకు తండ్రి కోపాన్ని చూచి హడలిపోయాడు.

మంత్రి "ఇది మనరాజుగారి దర్బారు - మీరు రాజుగారి ముందున్నారు" అన్నాడు.

"ఆ! ... ద్రోహం... మోసం. భగవత్సాన్నిధ్యమనిచెప్పి నన్నిచ్చటికి పిలుచుకొనివచ్చి భగవన్నామ సంకీర్తనాన్ని కలుషితంచేయ పూనుకున్నారా మీరు? - ఇంతకాలం భగవంతు నుద్దేశించి, భగవంతుని ఎదుట చేస్తున్న సేవను, ఆరాధనను మంటకలిపిన దుర్మార్గులు మీరు - డబ్బుకు, తుచ్ఛ సుఖానికి ఆశపడి నన్నితప్పుడు దోవకు తెచ్చినందుకు నీపై మొదట పగతీర్చుకోవాలి" అంటూ రౌద్ర నరసింహమూర్తిలాగ అటూ యిటూ దర్బారులో పరుగిడసాగాడు. పసిబాలుడు భయభ్రాంతుడై ఏమూలనో నక్కాడు. మంత్రులు, సామంతులు బహుమతులను, పళ్ళెల్లో నుంచుకొని ఆ గాయకుని కర్పించాలని అటు యిటు పరుగెత్తసాగారు. కబోది గాయకుడు ఆ త్రొట్టుపాటుతో అటూ యిటూ పరుగెత్తి మేడమెట్లమీద కాలుజారిపడి ముఖాన బలమైన గాయము తగిలి రక్తము ప్రవాహంలాగ కారజొచ్చింది.

"భగవంతుడు నేను చేసిన అపరాధానికి తగిన రీతిగా నన్ను శిక్షించాడు. దాంతోపాటు యీ నా అపరాధాన్ని ప్రేరేపించి ప్రోత్సహించినవారికి సయితం యీ ఈసురుకొట్టక తప్పదు" అంటూ అంధగాయకుడు పరమాత్మలో ఐక్యమైపోయాడు.

కొడుకు వెక్కి వెక్కి ఏడ్చాడు. ప్రభువు అతన్ని తన ఆస్థానంలోనే యుంచుకొని తన కుమారునితోబాటు పోషించసాగాడు.

అంధగాయకుని అస్తమయమైన పదిరోజులకే రాజకుమారునికి ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. అతనికి స్వస్థత చేకూర్చగల వ్యక్తి ఎవరూ కనుపించ లేదు.

రాజకుమారుని శయ్య ప్రక్కన మోకాళ్లమీద నిలుచుండి తదేక ధ్యాన్నంతో "భగవంతుడా! మానవుడు తెలిసీ, తెలియకుండాకూడ అనేక అపచారములు చేస్తుంటాడు. అట్టిదే మానాన్నపట్ల జరిగింది. అందుకుగాను ప్రతీకారంవద్దు ప్రభూ! రాజకుమారుని కాపాడి రాజకుటుంబాన్ని పశ్చాత్తప్తులనుచెయ్యి!" అంటూ పలుమారు ప్రార్థించసాగాడు. క్రమంగా రాజకుమారుడు ఆరోగ్యాన్ని కోలుకొన్నాడు. త్యాగధనుడైన అంధగాయకుని పట్ల భక్తి, గౌరవ సూచకంగా అతని కొడుకును ఆ రాజ్యంలో ప్రేమాభిమానములతో రాజకుటుంబమూ, ప్రజలుకూడ ఆదరించేవారు.

—o—